**'కంచే చేను మేస్తే కాచే వాళ్ళెవరు?' అన్నది యెప్పుడో పుట్టిన సామెత. చేను మేయడమూ తనను కాచుకోవడం కూడా తెలిసిన కంచె కెళ్ళని కంచె కథ యిది!**


అదొక పల్లెటూరు! దేశం నిండా అలాంటి పల్లెలు కొల్లలు! ఆ పల్లెలకి సంరక్షకుడిలా—నాలుగైదు పల్లెల మధ్య ఒక టౌను! ఆ టౌనును సంరక్షించడానికన్నట్టుగా మధ్యలో ఒక పోలీసు స్టేషను—


ఊరంతా తెల్లారినా ఇంకా ఆ పోలీసు స్టేషనులో తెల్లారలేదు. ఊళ్ళో కోడి నాలుగు గంటలకే కూసింది. పాలవాళ్ళు—పనివాళ్ళు—పనున్నవాళ్ళంతా తొలి వార్నింగ్‌కే లేచారు. ఇంకా లేవని వాళ్ళని లెండంటూ రెండో కూత పెట్టింది కోడి. ఆ పోలీసు స్టేషనులో చక్కగా రెండు బెంచీలు దగ్గరగా కలిపి పక్కేసుకుని ఫేనుకిందికి లాక్కుని గుర్రుపెడుతూ నిద్రపోతున్నాడు నైట్ డ్యూటీ కానిస్టేబిల్ గవర్రాజు.

ఆ గవర్రాజు బంగారంలాంటి నిద్ర చెడకొడూ ఎవరో తలుపులు దబదబ బాదారు....గవర్రాజు కళ్ళిప్పితే మళ్ళీ నిద్ర పట్టదన్నట్టు ఒక కన్ను సగం తెరచి గోడనున్న గడియారం చూశాడు. ఇంకా ఐదున్నరే చూపిస్తూందా గడియారం- గవర్రాజుకి బెపెరినట్టు. మళ్ళీ తలుపులు బాదారు. "ఎవడ్రా అని—యింత పొద్దునే నీయమ్మ సిగ తెరగా-" తిట్టుకుంటూ వూడిపోతున్న లుంగీ సవరించుకుంటూ యింక తప్పదన్నట్టు లేచాడు గవర్రాజు. లేచి నిలబడ్డ గవర్రాజు గజరాజులా వున్నాడు. ఆరడుగుల పొడుగు, ఆ పొడుక్కి ఎక్కువే అయినంత లావు. ముందుకు జారి కింద పడానని బెదిరించే పొట్ట-వంటికి సరిపోయిన పెద్ద మొహం. ఆ మొహంలో కనపడని ఏనుగు కళ్ళు. కనపడే తొండంలాంటి పొడుగు ముక్కు.... వీడికి పెదాలులేవా అన్నట్టు కప్పేసే మీసాలు.... గంజిపెటిన కాకీ నిక్కరు వేసి షరు టక్ చేసి. లాఠీ పట్టి కాకీ స్టాకింగ్స్‌తో టకటకలాడే బూట్ల చప్పుడు చేస్తూ నడుస్తుంటే పోలీసంటే యిలా వుండాలి భయపడేట్టు అనుకుంటారు. కానిస్టేబిల్ అయిపోయాడు గాని ఇన్‌స్పెక్టర్ అయితే ఇంకెంత ఠీవిగా వుండేవాడో అన్పించేది అందరికీ... ఆ గవర్రాజు దర్జా ఇప్పుడు లుంగీతో కాస్త తగ్గిందికాని, గజరాజు చచ్చినా, బతికినా వెయ్యి వరహాలే అన్నట్టు లుంగీలో వున్న కానిస్టేబిలూ కానిస్టేబిలే కదా - ఆ కానిస్టేబిల్ గారు నిద్ర చెడిపోయిన కోపం తలుపుల మీద చూపిస్తూ భళ్ళున తలుపులు తెరిచారు.

తలుపు అవతల.... తలుపు తట్టడమే నా నేరం అన్నట్టు బెదురుగా, భయంగా, దీనంగా చూస్తున్న ఆ మనిషికి.... వయసు ఎంతో చెప్పడం కష్టం. ముప్ఫై వుండచ్చు. నలభై వుండచ్చు. ఎభై వుండచ్చు. జుత్తు పీకేసిన తాటి టెంకలా వుంది. గడ్డం గీసుకోడానికి, గీయించుకోడానికి డబ్బుంటే దాంతో నాలుగుల్లిపాయలు కొనుక్కుందును అన్నట్టు బాగా మాసి వుంది. తింటున్న తిండి బుగ్గలదాకా యెక్కడ చేరుతుంది అన్నట్టు దవడలు పీక్కుపోయి వున్నాయి. రంగు నలుపయినా ఆ రంగులో నిగారింపు కాకుండా చర్మం ఎండి, పొడలు పొడలుగా వుంది కట్టుకున్న పంచె "ఫేర్ అండ్ ఫేర్" అన్నట్టు వుతుకు చూసిన పాపాన పోయినట్టులేదు. తొడుక్కున్న బనీనులో గుడ్డకంటె చిరుగులే యెక్కువున్నాయి. రాత్రంతా పరిగెత్తి వచ్చినట్టు ఆయాసంగా రొప్పుతున్నాడు.

ఆ మనిషిని చూడగానే అణాకానికి చెల్లనివాడని అర్థం అయిపోయింది గవర్రాజుకి. అలాంటి అష్టరాల్‌గాడు వచ్చి నిద్ర చెడగొట్టినందుకు—నిద్ర చెడగొట్టేంత ధైర్యంగా తలుపు తట్టినందుకు కోపంకంటే ఆశ్చర్యం ఎక్కువేసింది. ఆశ్చర్యపడ్డం అయ్యాక మళ్ళీ కోపం ముంచుకువచ్చింది. "ఎవడ్రా నువ్వు.... నీ యమ్మ... పొద్దుటే ఏం కొంపలంటుకున్నాయిరా" చూపులతో భస్మం చేసేటట్టు ఆపాదమస్తకం చూస్తూ అడిగాడు గవర్రాజు... ఆ చూపుకే వణుకుతూ.... నీళ్ళు నమిలాడు ఆ మనిషి— "బాబూ.... మా ఆడదాన్నెట్టుకొచ్చారండి"....ఆ అనడంలో తన తప్పున్నట్టు నసుగుతూ బెదురు చూపులు చూస్తూ అన్నాడు. గవర్రాజు ఆశ్చర్యంగా, వింతగా, అర్థం కానట్టు చూశాడు. ఏదో మీక్ కేసో... ఏ పొలాల తగూలో, కొట్టుకున్న కేసో, ఏ గేదో, ఎదులో ఎవరో పట్టికెడితే ఎంతెంత యివ్వడానికి వచ్చాడనుకున్నాడు గవర్రాజు.





# కంచె మేసిన చేను

ఓ. కామేశ్వరి

"ఆడదాన్నటుకొచ్చారా.... ఎవర్రా.... ఏటంటున్నావు అసలు...." తీవ్రంగా అడిగాడు

"తమరేనండీ...." బెదురుగా చూస్తూ అన్నాడు.

"ఎర్రా.. .సంజకొండకా.తాగొచ్చావా? నీ ఆడదాన్ని నేనట్టుకొచ్చానా.... ఏట్రా పేలుతున్నావు... మక్కె లిరగ్గొట్టగలను" గవర్రాజు నిద్రమత్తు పూర్తిగా వదిలి పోయింది వాడి మాటలకి....

"మీరంటే మీరు కాదు బాబూ. పోలీ సోళ్ళు తీసికెళ్ళిపోనారండి...."

"పోలీసులు తీసికెళ్ళారా....ఎందుకు.... ఏట్రా నీ గోల.... ఎటంటావసలు - ఏటి జరిగింది. వృత్తి వున్నానికి పోలీసోళ్ళు నీ ఆడదాన్నెందుకుతీసికెడతార్రా...."గవ ర్రాజుకి కోపం తగ్గి కుతూహలం పెరి గింది–

"ఏటోనండి నేనింటికాడ లేనండి. సాయంకాలం ఇద్దరు పోలీసోళ్ళు దాన్ని లాక్కెళ్ళినారంట- రాత్రికాడంతా సూశా వసదని-రాలేదు బాబూ అంటరన్నారూ. టౌనెళ్ళి పోలీసు ఉషను కాడ అడుగు అంటె పరుగెత్తి వచ్చాను బాబూ మా చుక్కని ఇప్పించండి. అసలిదేటి సేసింది దొరా- వృత్తివున్నానికి దాన్నెందుకులాక్కొ చ్చారుబాబూ-" ఎంత వినయంగాఅన్నా వాడి గొంతులో ఆగ్రహం, బాధ ధ్వనించింది.

"మళ్ళి అదే మాట. ఎవడ్రా అట్టు కొచ్చాడు– నేను నీ పెళ్ళాన్ని తీసుకొచ్చి నట్టు దబాయిసున్నా వేటిరా... ఏ లంజ కొడుకు అట్టు కెళ్ళారో ఆళ్ళ నడుగు.... పో....ఇక్కడినించి. బంగారంలాంటి నిద్ర పెడగొట్టి పైగా పెళ్ళాన్ని అట్టు కొచ్చానంటావు. పో ముందు. నేకపోతే నిన్నులాకప్పులోపడేయిస్తాను....ఎళ్ళరా.. అదెవరితో పడుకోడానికి పోయిందో రాత్రి నీలాంటి మొగుడు ఏ ఆడదానికి కావాల్రా అంచేతే యెవడితోనోపోయుం టుంది. తెల్లారి వచ్చి వుంటుందిలే.... పో...." తిక్కరేగి కసిరాడు గవర్రాజు.

ఆ మాటలకి ఆ మనిషి మొహం ఆకా శంలో మబ్బేసినట్టు నల్లబడింది. తరు వాత ఒక్క మెరుపు మెరిసినట్టు కళ్ళల్లో ఒక్కక్షణం కోపంతో తళుక్కుమంది. ఆ తరువాత చినుకులు రాబోతున్నట్టు వాడి కళ్ళు తడి అయ్యాయి–"బాబూ. మేం కూటికి పేదయినా గుణానికి కాదండి. మా సుక్కి అలాంటిది గాదండి. మీ పోలీ సోల్లు లాక్కెళ్ళినారని మా గూడెం అంతా సెప్పినారు బాబూ. కావలిస్తే మావోళ్ళని అడగండి బాబూ. ఓ ఆడకూతురిని బల వంతంగా ఎందుకు లాక్కెళ్ళినారో మీ పోలీసోల్లని పిలిచి అడగండి దొరా. దాని తప్పేటి సెప్పండి బాబూ.... రాత్రంతా అదింటికి రాలేదండి ఎక్కడుంది అది. దాని తప్పేటి సెప్పండి బాబూ" గవ ర్రాజు మాటలకి ముందు బాధగా, ఆ తరు వాత కోపంగా, పౌరుషంగా అడిగాడు.

అప్పటికి గవర్రాజుకి యిదేదో కొట్టి పారేసే విషయంకాదని అర్థం అయి వాడి మాటల తీక్షణతకి తగ్గాడు- ఓరి వీడిదుంప తెగ. వంట్లో వూపిరి లేనట్టున్నా మాటలు జోరుగా వస్తున్నాయే- అనుకున్నాడు.

"ఏ పోలీసులు తీసికెళ్లారు. ఆళ్ళపేరేటి అసలు నువ్వెవరు. ఏటీ గొడవ-" ఇదేదీ తొందరగా తేలే వ్యవహారంలా కనపడక. అక్కడి కుర్చీ లాక్కుని కూర్చుని బీడి తీసి వెలిగించాడు.

"ఆళ్ళ పేర్లు మాకేటితెలుస్తాయిబాబూ. గుడిసెలో తొంగుంటున్నదాన్ని, గుడి

ఉచితం ఉచితం ఉచితం

## తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలనైనా సరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాతి ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండి పోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి. Address

GAUTAM CHIKITSALAYA (S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

## కాయకల్ప చికిత్స

ఈ చికిత్సవలన 3 లేక 4 మాసములలో జుట్టు రాలిపోవుట ఆగిపోయి, దట్టముగా వెంట్రుకలు పెరుగును. అకాలములో నెరసినవెంట్రుకలు నల్లబడును. చత్వారం తొలగిపోయి కండ్లజోడుతో నిమిత్తములేకుండామంచి చూపు వచ్చును. కదలిపోయిన పండ్లు మరల బిగిసిపోవును. తల్లి గర్భమునుండి జన్మించినప్పుడు దేహమునకు ఏ రంగు వున్నదో మరల ఆ రంగువచ్చి సౌందర్యము అభివృద్ధియగును.

వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు రూ. 4-00లు యం.ఓ. పంపవలయును.

మేనేజరు
శ్రీ యోగాశ్రమ్,
పెదవాల్తేరు,
విశాఖపట్టణము-17.

సెలో జొరబడి "నీ మొగుడు దొంగతనం సేసి గుడిసెలో డబ్బు దాచాడట పదవే పోలీసుస్టేషన్‌కి' అంటూ లబోదిబోమని ఏడుసున్నదాన్ని లాక్కెళ్ళినారండి. గుడిసెల్లో అంతా ఆడోళ్ళే. మగాల్లంతా పనికి పోనారు. ఆడోళ్ళు అడ్డుపడితే అందరిని లాఠీతో బెదిరించి లాక్కెళ్ళి పోనారు బాబూ. నే నింటికాడ కొచ్చేసరికి ఆడోళ్ళంతా యిసయం చెప్పారు. నే దొంగతనం సేయటం ఏటి, డబ్బేటి, దాన్ని లాక్కెళ్ళడం ఏటి.... ఏటి బాబయ్యా ఈ గొడవంతా. బాబూ, ఇన్‌స్పెకరు బాబుకి యిసయం సెప్పాలని వచ్చాను."

'ఓరి నీ.... నీకుకానిస్టేబిల్ చాలలేదురా! ఇన్‌స్పెకర్ కావాలిరా తొత్తుకొడకా' అనుకున్నాడు గాని అనలేదు—అంటే—అసలే ఈ వెధవలు మొండి చచ్చినాళ్ళు—ఆ ఇన్‌స్పెక్టర్ వచ్చేవరకు కదలకుండా కూచుని మీ కానిస్టేబిల్ తిట్టాడని సెపితే సికాకు. యింతకీ ఈ గొడవేంటో తుది మొదలు అంతుచిక్కలేదు. పోలీసులంటే, ఎవరెళ్ళారు—దొంగతనం వీడు సేశాడే అనుకున్నా, ఆడి పెళ్ళాన్ని లాక్కెళ్ళి రాత్రి అంతా ఎక్కడ పెట్టారు? అసలు వాళ్ళు పోలీసులా!.... డ్యూటీలో నిన్న వున్నదెవరు? ఆళ్ళపనే యిది. ఆ సెకూతురిని లాక్కెళ్ళి.... ఆలోచించిన గవర్రాజుకి ఏదో తట్టింది.... అంతలోనే అబ్బె అది కాదు అనుకున్నాడు. ఎవరన్నా పోలీసు డ్రస్సు వేసుకెళ్ళి దాన్ని లాక్కెళ్ళారా! అర్థరూపాయికివళ్ళమ్మకునేఆడదిదొరుకుతూండగా డ్రస్సుకి, గిస్సుకి డబ్బుతగలెటి అంత కక్కుర్తి పడేందుకు అది రంభా, ఊర్వశా? ఈడింత అందంగా వున్నాడు—ఆడిపెళ్ళాం రంభయితే యీడితో కాపురం సేస్తుందా—యింతకీ యీ బుద్ధిలేని పని సేసి పీకలమీదకి తెచ్చిన ఆ యిద్దరు తమ వోళ్ళే అయితే పోలీసు డిపార్టుమెంటుకే ఎంత ప్రతిష్ఠ—సబ్ యిన్‌స్పెక్టర్‌ది అసలె ఉడుకురక్తం. కొత్తగా వచ్చాడు—యిన్నాడంటే ముందే సస్పెండ్ చేసి పారేస్తాడు ఈళ్ళ కక్కుర్తి మండిపోను... మనసులోనే వాళ్ళని తిట్టిపోశాడు.... ఎంత అనుకున్నా తన డిపార్టుమెంటోళ్లు—ఆళ్ళు ఉద్యోగాలూడితే.... పెళ్ళాం పిల్లలు ఎం తింటారు. స్వజన పక్షపాతంతో ఆలోచించాడు గవర్రాజు. ఈ విషయం సబిన్‌స్పెక్టర్‌వరకు వెళ్ళకుండా వీడికేదోచెప్పి, అక్కడికెళ్ళి మాట్లాడి.... ఏదోచేసి కేసు, గీసు లేకుండా చెయ్యాలి.... గవర్రాజు ఆలోచన అది. వీడిని తిట్టి కసిరి లాభంలేదు మంచి మాటలతో నచ్చచెప్పాలి అనుకున్నాడు.

"సూడు.... నీ పేరేటి?.... ఎం చేస్తావు నువ్వు."

"పెంటయ్యండి.... కూలి సేస్తానండి పూడ్పుల్లో, కోతల్లో, మిల్లుకాడ, యిటికఆవకాడ ఎక్కడ కూలి దొరికితే అక్కడ సేస్తానండి."

"మరి నీ పెళ్ళాం—దాని పేరేంటి— అదీ కూలిసేస్తుందా.... నీకు పిల్లలున్నారా.... నీ పెళ్ళాం ఎలాగుంటుంది.... అహా.... అదికాదురా. దాన్నిగురించి సెప్పాలంటే, అడగాలంటే ఎలాగుంటదో తెలియాలి కదా...."

అంత సేపటికి పెంటయ్య మొహంలో మెరుపు వచ్చింది— "సుక్క.... సుక్కనాగుంటదండి. అందరూ పెంటిగా, సన్నాసి ఎదవా, ఏదో పుణ్యం సేసుకున్నావురా సుక్కలాటి పెళ్ళానిచ్చాడురా దేముడు అంటారండి. సుక్క నల్లగుంటేనేం అండి లచ్మీదేవి కల వుందండి దాని మొహంలో." పెళ్ళాంసంగతి చెప్తూ గర్వపడ్డాడు పెంటిగాడు "అదిపూడ్పులపుడు, కోతలప్పుడు కూలికెల్తదండి. ఉత్తప్పుడు యెల్లదండి. మాకెంత గావాలండి, పిల్లా పీచులేరు...."

"సర్లే. సెప్పావుగా.... మావోలు డ్యూటీనోకి రాగానే అడుగుతాను. అసలేటయిందో.... నువెల్లు యింటికి. నే తరువాత ఎండెక్కాక వస్తాను మీ వూరికి .." నచ్చచెప్పే ధోరణిలో అన్నాడు గవర్రాజు.

పెంటయ్య ఒక్క క్షణం ఆలోచించాడు. తల గోక్కున్నాడు— "[illegible] కపిలెంటు రాసియ్యాలిగందా'.... మావూర్లో ఆల్లు సెప్పారు. యిన్‌స్పెకరు గారికి నీ పెళ్ళాం నిలా సేశారని కపిలెంటు

## ఏకపాత్ర



ఒక నటుడుచేతే చేయిస్తే
ద్విపాత్రాభినయం
మందుఖర్చు విషయంలో
సగానికి సగం నయం.

—నీలాప్రియ

యిచ్చిరా పో.... అన్నారండి."

ఓర్ని.... యీ వెధవలు తెలివిమీరి పోయారు. కంప్లైంట్ రాసివ్వాలని తెలిసే టంత తెలివి మీరారు. "పోరా- యిప్పుడేం రాసివ్వక్కరలేదు- నే మీ యింటి కొచ్చి అందరితో మాటాడి. మా పోలీసోళ్ళు నిన్న డ్యూటీలో ఎవరున్నారో ఆల్లని అడి గాక అప్పుడు నీ పెళ్ళాం యింకా యింటికి రాకపోతే రాసిద్దువుగానిలే." గట్టిగా దబా యిసే సబిన్స్పెకర్ వచ్చేవరకు గుమ్మం ముందు కూర్చుంటాడని నెమ్మదిగానే అన్నాడు.

అప్పుడింక తప్పదన్నటు. తమ దయ అన్నట్టు చేతులు జోడించి, భారంగా, భారంమీదే నన్నట్టు చూసూకదిలివెళ్ళాడు.

* * *

"ఎవర్రా ఈ వెధవ పని సేసింది. మీ నల్గురిలో యెవర్రా చెప్పండి." డ్యూటీ కొచ్చిన నలుగురు పోలీసు జనాన్లమీద యెగిరిపడాడు గవర్రాజు విషయం చెప్పి. నలుగురూ బెదురుగా చూసి అడ్డంగా తల లాడించారు. మీరు కాకపోతే యింకెక్కడ యెవరున్నార్రా....మీ నల్గురిలో యిద్దరీ వెధవ పని చేశారు చెప్పండి....లేకపోతే ఎస్. ఐ.తో చెప్పి సస్పెండు చేయిసా. లాకప్పులో పడేయిస్తా. సి .. ఏం జన్మరా. ఆడగంటే అంతకక్కుర్తిరా.. రేప్పుద్యోగం ఊడితే అప్పుడు తెలుస్తుంది ఆ సుకం ఏటో ....సెప్పండిరాఅబదం సెపితేమీపాట్లు కుక్కలుకూడా పడవు. దాని మొగుడు పొద్దుటే యిన్స్పెక్టరు అంటూ వచ్చి కూర్చున్నాడు ఆడ్ని ఏదోసెప్పి వది లించుకున్నాను నిజం సెప్పకపోతే సబిన్ స్పెకర్ రాంగానే కేసు పుటప్ చేయిస్తా. మీకు తెలుసు ఎస్ ఐ రూల్సు మనిషని. ఈ సంగతి తెలిసే మీ వుద్యోగాలు వెంటనే పీకేస్తాడు ఎగవల్లారా! రేప్ కేస్ మీద కనీసం మూడేళ్ళు జైల్లో కూకోవాలి. అందులో పోలీసోడుఅంటే మరీ సన్నిళ్ళువడ్డి స్తాడు జడ్జి. సెప్పండిరా దొంగనా కొడక లారా" తలొంచుకుని చెక్క బొమ్మల్లా నిలుచున్న వాళ్ళని చూసేసరికి గవర్రాజు తిక్క మరింత రేగింది. "ఎరా.... అప్పిగా....వరేయ్. సెప్పు....నీ పనేనా యిది " అప్పలకొండ నల్లబడిన మొహం. కళ్ళల్లో బెదురు సూడగానే పోల్చుకున్నాడు గవర్రాజు. ఎదవ పని సేసినాడి మొగం సెప్తుంది. ఏ కోర్టులు. ఏ జడ్జీలు అక్కర లేదు నిజం లాగడానికన్నది గవర్రాజు థీరీ. అతని సర్వీసులో దొంగవాడి మొఖం చూసి పోల్చగలడు. కోర్టులో సాక్ష్యాలు కావాలంటే అది వేరే

### ఔను నిజం!

బర్మింగ్‌హాంలో వున్న పోలీసులలో ప్రతి ఐదుగురిలో ఒకరు నర్సుని పెళ్ళాడారు.

సంగతి. అప్పలకొండ దగ్గరకి వెళ్ళి.... "ఊ ... ఎరా వళ్ళు కొవ్వు బలిసిందేట్రా. ఎదవా, సేసినా దొరక్కుండా సేయాలరా సన్నాసీ....పోలీసుడ్రస్సేసుకెళ్ళి పబ్లిక్‌గా ఆడదాన్నట్టుకెడితే ఎవరూ ఏం సేయరనుకున్నావేట్రా.... రూపాయి డబ్బులకి దొరికే ఆడకూతుర్లుండగా.... ఆ సన్నాసిగాడి పెళ్ళాం కావలసివచ్చిందిరా. దాని మొగుడూపుకుంటాడనుకున్నావేట్రా.... యిప్పుడాల్లూ తెలివిమీరిపోనారు. కేసెడితే ఏం సేస్తావురా.... ఇంతకీ రెండో వాడెవడో.... ఎరా నర్సింలూ.... ఇద్దరూ తోడుదొంగలయ్యారా.... వదండిరా మీకు మూడిందిరా. అందుకే ఎదవ బుద్దులొచ్చాయి.... సెప్పండిరా. యింతమందుండగా దానిమీద మీ కళ్ళెలా వడ్డాయిరా. అంతా సెప్పండి- అబద్ధాలాడితే డొక్క చించేస్తా...." గవర్రాజు చేతులు వెనక్కి పెట్టి సీరియస్‌గా పచార్లు చేస్తూ అన్నాడు. గవర్రాజు లుంగిలోంచి డ్రస్సులోకి మారిపోగానే కానిస్టేబిల్ ఠీవి వచ్చింది. "డ్యూటీలో వున్నాను. అబద్ధం సెపితే లాఠీతో కీళ్ళిరగ్గొడతాను. అందరినీ కొట్టాను- ఇప్పుడు మీరు రుచి చూద్దురుగాని" నోరు మూసుకుని నీళ్ళు




మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడసన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
– శస్త్రచికిత్స
అవసరములేదు!

ప్రఖ్యాతి చెందిన!
ఖటావ్ మిల్లు వారి
★ 100% పాలియస్టర్ చీరలు.
★ ఫుల్‌వాయిల్, ఆఫ్ వాయిల్ చీరలు
★ షర్టింగులు, గ్లాసుకో ధోవతులు
★ డ్రస్ మెటీరియల్సు, 2x2 రూబియాలాన్సు
★ స్కూలు యూనిఫారంలు... వగైరాలకు
విజయ షోరూమ్
ప్రత్యేక ఖటావ్ మిల్లు వస్త్రముల షోరూమ్
J.D. హాస్పటల్ ప్రొద్దు
గవర్నరుపేట...... విజయవాడ-2

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్

వివాహము వాయిదా వేయ నవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్కలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.
రావూస్ క్లినిక్
టి. బి. రోడ్. తెనాలి. ఫోన్ : 700. 1010.

నములుతున్న ఇద్దరినీ చూశాడు చెప్పం డన్నట్టు.

"సుక్కి బాగుంటాది...." నసిగాడు అప్పలకొండ.

"బాగున్న ఆడోళ్ళందరితో తొంగుం టావా... చెమడా లూడగొడారు. బాగున్న వాళ్ళందరితో పడుకుంటే...." కళ్ళెఱ్ఱ చేశాడు గవర్రాజు.

"అగసలు నీ కళ్ళయెప్పుడు పడింది?"

"ఓ సారి.... సంత కెళితే .... అక్కడ సూశా" గొణిగాడు.

"సూసి మోహించేశాడు. పెద్ద మొగాడు బయలుదేరాడు. ఏరా నర్సింలూ నువ్వెలా చూశావు"

"అప్పలకొండ చూపించాడు.... చూపించి." భయంగా ఆగిపోయాడు నర్సింలు. "ఊ.... యిద్దరూ కల్సి ప్లానేసి గుడిసెలో జారలాక్కెళ్ళారన్నమాట.... ఎక్కడికి తీసికెళ్ళారు - రాత్రంతా అది ఇంటికి రాలేదన్నాడు దాని మొగుడు - ఎక్కడ దాచారు దాన్ని -"

అప్పలకొండ, నర్సింలు మొహాలు చూసుకున్నారు.... "ఎలిమెంటరీ స్కూలు పాకలో...." అన్నారు ఎఱ్ఱబడిన మొహాలతో.

"మీరు అక్కడికి తీసికెళ్ళడం ఎవరూ చూడలేదా...."

"లేదు చీకటడాది - ఆ స్కూలు కాసంత దూరంగావుంది వూరికి. పోలీసోళ్ళం అనగానే అంతా బయపడి మా ఎనక ఎవరూ రాలేదు...."

"మరి అది తెల్లారేదాకా యిల్లు చేరలే దన్నాడు వాడు."

"మేం యిడిసిపెట్టగానే పరిగెత్తి అరిచి గోల చేస్తుందని...." చీకటిమాటున వేడి రక్తంలో చేసిన పాపపు పని. తెల్లారి వెలుగులో చెప్పుకోవాలంటే వాళ్ళిద్దరికీ మొహాలు చెల్లడంలేదు- చెప్పకపోతే మరింత శిక్షిస్తారని చెప్పకా తప్పలేదు- "కాళ్ళు తాడెట్టి కట్టేసి వచ్చాం...." తలలు దించుకుని చెప్పారు. గవర్రాజు బీడీతీసి తుపుక్కున ఉమ్మాడు. "ఛీ.... ఒక ఆడకూతురిని కట్టేసి ఆంబోతుల్లా.... ఛీఛీ మీ కురిశిక్ష వేసినా పాపంలేదు" ఛీత్కారం చేస్తూ అన్నాడు ఇద్దరి మొహాలూ మరింత వంగాయి.

గవర్రాజు సర్వీసంత వయసున్న వాళ్ళిద్దరు చేసిన పనిని అతను క్షమించలేకపోయినా... తనకింద పని చేసేవాళ్ళు. డిపార్టుమెంటు కేమచ్చపడే ఆపని చేసిన ఆ యిద్దర్నీ బయటపడేస్తే అవమానం తను కే కదూ-! జరగకూడనిదెలాగో జరిగింది- యిప్పుడు వీళ్ళ ఉద్యోగాలు పీకించి పెళ్లాం పిల్లల్ని వస్తులుంచితే ఆ పాపం తనది కాదూ.... కోపం, ఆవేశం తగ్గాక.. అర గంటసేపు గదిలో పచార్లుచేసి ఆలోచిం చాడు గవర్రాజు.

> **ఔను నిజం !**
>
> **ఆ**స్ట్రేలియాలో డార్విన్ అనేచోట పౌరులలో పెద్దలు ఏటా సగటున ప్రతి ఒక్కరూ 62 గ్యాలన్ల బీరు పుచ్చుగుంటారట! మహానుభావులు!

* * *

ఆ పాలెంలో.... వూరందరికీ తెల్లారినా పెంటయ్య యింట్లో తెల్లారలేదు పొయ్యిలో పిల్లి లేవలేదు. తెల్లారి పోలీసు స్టేషన్‌కి నడిచివెళ్ళి— కాళ్ళీడ్చుకుంటూ వచ్చి, చుక్కి జాడ కానరాక దిగులుగా, నీరసంగా, నిస్త్రాణగా కుక్కి మంచంలో కుక్కిన పేనులా వాలిపోయాడు. చుక్కి తన చుక్కిని ఆ పోలీసులు లాక్కెళ్ళి ఏం చేశారో, ఎందుకు లాక్కెళ్ళారో, ఎంత చదువు సంధ్యలేక జ్ఞానం లేనివాడయినా, రాత్రంతా రాలేదంటే అతని మనసు జరిగిన సంగతి గ్రహించ కల్గింది. దిక్కు తోచనివాడిలా మంచంలో పడుకున్నవాణ్ణి యిరుగు పొరుగు వచ్చి ఓదార్చసాగారు. పది గంటలయ్యాక స్కూల్‌కెళ్ళిన పిల్లలు కటిపడేవున్న సుక్కిని చూసి కట్లిప్పి పరుగున వచ్చి పెంటయ్యకావార్త చెప్పారు.

కట్లిప్పినా, కాళ్ళు రానట్టు, నడవలేనట్టు, నడిచివెళ్ళి అందరినీ చూడలే నన్నట్టుగా చుక్కి అక్కడే కూలబడింది. పరుగున వచ్చిన పెంటయ్యకి పెళ్ళాన్ని చూడగానే కడుపులో దేవినట్లయింది. చక్కని చుక్కి ఒక్కరాత్రికే చిక్కిపోయినట్టు- వాడిన తోటకూరకాడలా, పీల్చిన చెరుకు పిప్పిలా, రసం జుర్రేసిన మామిడి పండులా....చక్కని చుక్కికి దిష్టి తగలకుండా పెట్టినట్టుబుగ్గన గాట్లతో, మచ్చలతో కనిపించిన పెళ్ళాన్ని చూసి-మరిచూడలేక తల దించుకున్నాడు. మొగుడ్ని చూసిన చుక్కి మొగంలో మిగిలిన రక్తంకాస్తా యింకిపోయినట్లయిపోయింది. రాత్రం ఏడ్చి వాచిన కళ్ళు మరి ఏడవం అని మొండికేశాక - నిలువుగుడ్లు పెట్టుకు చూస్తూండిపోయింది. రాత్రంతా శతకోటి దేవుళ్ళని పేరు పేరున రక్షించమని పిలిచి పిలిచి అలిసిపోయిన ఆ నోట్లోంచి మరి

మాట పూడి పడలేదు. భయపడాల్సినదంతా నిన్న అయిపోయింది. యింకేం భయం. యింకెందుకు భయం! భయపడాల్సింది మొగుడ్ని చూసి కాదన్నట్టు చుక్క రెప్ప వాల్చకుండా చూస్తూండిపోయింది. చుక్క పిచ్చిచూపులు చూడగానే పెంటయ్య "సుక్కీ ఏటయిందే. ఏంచేశారే ఆ ఎదవలు ఏటే అలా సూస్తావు" అంటూ కలవరంగా అడిగాడు నోరిప్పనిసుక్కని ఎలా మాట్టాడించాలో పెంటయ్యకి అర్థం కాలేదు. "భయపడిపోనాదిరా ఆడకూతురు. దానిని- ఇంటికి తీసుకెళ్ళు- నెమ్మదించాక సెపుతుంది." ఓ ముసలాడు అన్నాడు. "సుక్కా రాయే. ఇంటి కెడదాం" చెయ్యి పట్టుకు నిల్చోపెట్టాడు. నిలబెడితే నిలబడింది. నడిపిస్తే నడిచింది. ఇంటికి తీసికెళ్ళి కూర్చోపెడితే కూర్చుంది. ఆ వాడ వాడంతా గుడిసె ముందు మూగారు. సుక్కని చూసి కొందరు జాలిపడ్డారు- కొందరు వింతగా, కుతూహలంగా చూశారు. కొందరు చెవులు కొరుక్కున్నారు. ముసలాళ్ళు కొందరు లోపలికెళ్ళి చుక్కని బుజ్జగించి, ధైర్యం చెప్పి మాట్టాడించాలని చూశారు. జరిగిందొక ఎత్తు, జరుగుతున్నది ఒక యెత్తులాగ బతుకు బట్టబయలు అయి నలుగురి ముందు గుడ్డలిప్పించి చుక్కని నిలబెట్టినట్టు విలవిల్లాడిపోతున్నాడు పెంటయ్య. చూడొచ్చిన వాళ్ళని చూడద్దనలేక, పొమ్మనలేక, మా బతుకు మమ్మల్ని బతకనియ్యండి అని అనలేక, ఏం చెయ్యలేనివాడిలా చేతులు ముడుచుకుని గుడిసె ముందు కూర్చున్నాడు పెంటయ్య.

అదే సమయంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణే మా ధ్యేయం. న్యాయరక్షణకే మేమున్నాం-అన్నట్టుగా గవర్రాజు, నలుగురు పోలీసులని వెంటబెట్టుకు వచ్చాడు. ఆ ఐదుగురు బూట్ల టకటకలతో ఆ పల్లెలో ఇళ్ళు అదిరిపోయి కెలికిన చీమల పుట్టలోంచి చీమలు వచ్చినట్టు గుడిసెల్లోంచి జనం బయటికి వచ్చి కుతూహలంగా చూడసాగారు. గవర్రాజు మిలిట్రీ పేరేడ్ చేయిస్తున్న సైనికాధికారిలా యిటు, అటు చూడకుండా పెంటయ్య చెప్పిన గుర్తున్న బావి దగ్గరకి వచ్చాడు. అక్కడ మూగిన గుంపు పోలీసులని చూడగానే రాయి పడిన నీళ్ళమాదిరి చెదిరిపోయారు. గుంపు చెదరగానే గుడిసె ముందు అప్పుడే యింట్లోంచి శవం వెళ్ళినట్టు దిగులుగా, దీనంగా కూర్చున్న పెంటయ్యనిచూసి చరచర అటు నడిచాడు గవర్రాజు సిబ్బందితో. "ఎవర్రా. మా పోలీసోళ్ళు నీ పెళ్ళాన్ని అట్టుకెళ్ళారని చెప్పినవాళ్ళు యెదవనాయాళ్ళు మీకేం పనిపాటలేక మా పనులు సెడగొడతారు, ఎవర్రా ఆళ్ళని రమ్మను. ఇదిగో మా జవాన్లని యీడ్చుకొచ్చాను. సూపమనరా యిందులో యెవరో. ప్రతివోడికి పోలీసోడు లోకువయిపోనాడు. పోలీసోడు వూ అంటేతప్పు, ఆ అంటే తప్పు. డ్యూటీ సేస్తే తప్పు, సేయకపోతే తప్పు. డ్యూటీ సేసి యెవడికన్నా పనిష్మెంటిస్తే యెందుకిచ్చావంటాడు పైవోడు గమ్మునూరుకుంటే యెందుకూరుకున్నావంటాడు. యెవడో కాకీ డ్రస్సేసుకు వస్తే ఆడు పోలీసోడే - కాకీ డ్రస్సేసుకొచ్చిన ప్రతి అణాకాని ఎదవా పోలీసోడే! నీ పెళ్ళాం మీద మోజున్న ఏ రవుడీ ఎదవలో, పోలీసు డ్రస్సేసుకు వస్తే ఎవరూ ఏటీ అనరని తొడుక్కుని వచ్చుంటారు- రాత్రంతా దాంతో పడుకుని వుంటారు- మీ మాటలు నమ్మి మా యిన్స్పెక్టరికి కంప్లైంట్ చేశా. ఆయన నా మీద ఫైరయిపోయి ఎవరు సూశారో ఆల్నట్టుకు పోలీసు స్టేషని కీడ్చుకురా, ఆల్లే అబద్ధం ఆడారో, యీ ఎదవలే సేశారో తెలుస్తా అని సిందులు తొక్కాడు. యిదిగో యీల్ననట్టుకు వచ్చా — సెప్పండి యీలలో ఎవరో. అబద్ధాలాడితే దొక్క చీరేసా- సరిగా సూసి సెప్పండి అబద్ధం సాచ్యానికి అర్నెలు జైలు శిచ్చ- సూసినవాళ్ళు నాతో పోలీసు స్టేషన్కి రండి. ఊ రండి. ముందుకొచ్చి ఈ నలుగురిలో ఆయిద్దరున్నారేమో సూసి సెప్పండి." వస్తూనే గవర్రాజు చూపించిన 'కానిసేబిల్ ధాటి' కి అక్కడ గుమిగూడిన అంతా మొహాలు చూసుకున్నారు. గుసగుసలాడ

## గాథావళి :

# ప్రకాశంపట్ల చిలకమర్తి మోజు

కాకినాడలో పారిజాతాపహరణ నాటకంలో (1892) టంగుటూరి ప్రకాశం అభినయ కౌశలం చూసి మెచ్చిన ఒక ఒడిసీ యువకుడు శ్యామసుందర రాజ్ గురు



(పర్లాకిమిడి) "స్టార్ఆఫ్ ది స్టేజ్" (రంగ నక్షత్ర) అనే బిరుదిచ్చారట. నాటక సమాజం అమలాపురం వెళ్ళింది. అప్పటిదాకా తానూ, ప్రకాశమూ 'అండీ' లతో మాట్లాడుకునేవారని చిలకమర్తి కథనం. అమలాపురంలో మార్పువచ్చి "ఏమిరా" అనేంత చనువు ఏర్పడిందట. ప్రకాశం రూప, బుద్ధి విశేషాలంటే చిలకమర్తి తనకు యెంతో యిష్టమని రాశాడు. ప్రకాశం మెట్రిక్ ప్యాసయ్యాక చిలకమర్తి రెండు రూపాయలకు చీనీ మిఠాయి తెప్పించి నాటక సమాజం వారికందరికీ పంచాడు. జనార్దనస్వామి తిరునాళ్ళకు అందరూ ధవళేశ్వరం వెళ్ళి ఒక రోజంతా గడిపారు. ఆ సందర్భంలో చిలకమర్తి ప్రకాశం గురించి ఒక పద్యం చెప్పాడు.

ఈగ వ్రాలినగాని వేగజారెడునట్లు మవ్వంపు కురులను దువ్వినాడు
వరలలాటమునందు తిరుచూర్ణ రేఖను ముద్దుగారెడు భంగి దిదినాడు
అరుణ పల్లవమటు కరము రంజిలు చెంగావి వస్త్రంబును కట్టినాడు
చారలంగరఖాను జక్కగా ధరియించి వలెవాటు కండువా వైచినాడు
చెవుల సందున గిరజాలు చిందులాడ, మొగము మీదను జిరునవ్వు మొలకలెత్త
టంగుటూరి ప్రకాశము రంగు మెరయ, ధవళగిరి తీర్థమునకును దరలివచ్చె.

కంటి చూపులేని చిలకమర్తివారికి టంగుటూరి ప్రకాశం రంగేళీ వేషధారణ యింత నిండుగా ఎలా కనిపించిందో!

—రాంభాణం

దానికి కూడా భయపడి గమ్మున వూరుకున్నారు. "ఏరా నీ పెళ్ళాం యింటి కొచ్చిందా. దాన్ని పిలు"- జరగాల్సిన అన్యాయం జరగనే జరిగింది- కానిస్టేబిల్ వచ్చినా, క్యాబినెట్ మినిస్టర్ వచ్చినా జరిగేదేం వుంది అన్నట్టు నిర్లిప్తంగా జరుగుతున్నది ఏదో వింతలా చూస్తూ కూర్చున్నాడు పెంటయ్య -"ఏరా మాట్లాడవేం నీ ఆడదింటికి వచ్చిందా ?"

"వచ్చింది బాబూ వచ్చింది - చక్కని చుక్కలా వెళ్ళిన చుక్క - చింపిన విస్తరిలా వచ్చింది బాబూ.' అని అనాలనుకున్నాడు పెంటయ్య - కానిస్టేబిల్ని, ఆ చేతిలో లాఠిని చూసి అనలేక తలాడించాడు - "నే చెప్పలేదురా, ఎటో వెళ్ళిందదే వస్తుందిలే అని...."

"లేదు బాబూ, అది రాలేదు. స్కూల్లో కట్టిపడేస్తే తెచ్చాం బాబూ. కానిస్టేబిల్ బాబూ. దాని బతు కన్యాయం సేశారు. యెవరు సేశారో దేముడికెరిక. అది మాట పలుకు లేకుండా కూకుండిపోయింది. న్యాయం చెయ్యండి దొరా" ఒక ముసలాడు ముందుకువచ్చి అన్నాడు.

"నాయం సేయాలంటే సాచ్చికం వుండాలి. సాచ్చెం చూపండిరా. ఈళ్ళే సేశారని యెవరొచ్చి చెప్తారో చెప్పండిరా." అంతా మొహాలు చూసుకున్నారు తప్ప ముందుకు రాలేదు. పెంటయ్య పులుకు పలుకు లేకుండా నిల్చున్న అందరినీ చూశాడు. "నూకాలప్పా, మాలచ్చిమ్మ విన్న సూశాం అన్నారుగందా ఈళ్ళల్లో ఎవరో సెప్పండే...."అన్నాడు దీనంగా - నూకాలు, మాలచ్చిమి ఎదురుగా పోలీసులని చూశారు- వాళ్ళ మొహాలు వాళ్ళు చూసుకున్నారు- "ఏటో.... ఎవరో మాకేటెరిక - సందెకాడ వచ్చినారు - పోలీసులని చూశాంగాని మొకాలు మాకేటి గురు" నసిగింది నూకాలు. పోలీసులు స్టేషను కెళ్ళి చెప్పాలి అనగానే బెదిరిపోయారు వాళ్ళు. గవర్రాజు మహా వుదారంగా నలుగురినీ తీసికెళ్ళి వాళ్ళముందు నిలబెట్టాడు. "సూడండి - యీడా.... వాడా.... ఎవరో సరిగ్గా చూడండి-"నలుగురినీ చూపిస్తుంటే యిద్దరు నలుగురిని చూసి అవునంటూ తల ఊపారు — కాసేపు కాదంటూ తలలూపారు. "యిల్లా సాచ్చికాలట్టుకుని కోర్టు కెక్కితే అయినట్టే - గంగిరెద్దుల్లా తలలూపుతున్నారు. అవునా అంటే తల వూపుతున్నారు. కాదూ అంటే వూపుతున్నారు. పొండెహెస్....మాకేటి పని పాట నేదనుకున్నారేంటి- పెంటయ్యా, నీ పెలాం నీ యింటి కొచ్చింది. సాచ్చికం లేందే కేసెట్టడాని కవదు. ఈళ్ళే సేశారని సాచ్చికం సూపిస్తే చెప్పు. ఇన్స్పెక్టరు బాబుకాడ కంప్లైంట్ రాపిద్దువుగాని" చాలా నెమ్మదిగా, సౌమ్యంగా అన్నాడు. పెంటయ్య వెర్రిమొహంపెట్టి చూశాడు. తరువాత అదోలా నవ్వాడు చేతులెత్తి కనిపించని దేముడికి దండం పెట్టాడు. "బాబూ కనిపెట్టిసూడాల్సిన ఆబగమంతుడే కనుసాటు చేశాడు. యింక మీరేటి సేస్తారు. నాయం, అన్నాయం సూడాల్సిన ఆ బగవంతుడే వల్లకున్నాడు. యింక కోర్టులో కేసులు ఎట్టడానికి నాకెవరున్నారు బాబూ, నిజం సెప్పాల్సిన సుక్క నోరు ఆ దేవుడే మూయించి సేసినోల్లపచ్చం అయిపోనాడు. సాచ్చికాలు సెప్పాల్సినోళ్ళు నాయానికి, నిజానికి భయపడి మాట తప్పించినారు. వదిలేయి బాబూ, మమ్మల్నిట్టా వదిలేయి బాబూ. ఎల్లండి బాబూ ఎల్లండి...." చేతులెత్తి నుదుట తాటించి ఎవరో తరుము కొస్తున్నట్టు లోపలికెళ్ళిపోయాడు పెంటయ్య.

గవర్రాజు విజయగర్వంతో చుట్టూ చూశాడు. యింకెవరన్నా నోరెత్తడానికి మిగిలారా.... ఎవరొస్తార్రా ముందుకు ధొక్కచీలుస్తా అన్నట్టుగుంపుని చూశాడు. అంతా వెనక్కడుగులేశారు - గజరాజులా గవర్రాజు ముందడుగు వేసి కదిలాడు.

*

నాటకం అయిపోగానే బట్టలిప్పేసి వేషాలు తీసేసినట్టుగా... పోలీసు స్టేషన్కి రాంగానే నలుగురూ కాకీ బట్టలిప్పేసి, ఎర్రటోపీలు తీసిపారేశారు. అప్పలకొండ చేసిన తప్పు కడుక్కున్నట్టుగా నాళ్ళకి తలో ఐదు చేతిలో పెట్టిపంపాడు. లుంగీలతో, అండర్వేర్లతో వున్న ఆ నలుగురు మళ్ళీ తమ డ్రస్సులు తొడిగేసుకున్నారు.

గుర్రడితే- ఎదవల్లారా మీ సాచ్చికం యిదా, మీరేటంటారోనని యీదిన పోయే నల్లురికి డ్రస్సేసి తీసుకొచ్చాను. ఎదవల్లారా కాకీ డ్రస్సేసుకున్న ప్రతివోడు పోలీసోడు కాదురా. ఎవర్ని సూసి మా వోల్లంటార్రా, తప్పుడు సాచ్చికం చెప్పినందుకు పదండి పోలీసు స్టేషనుకి అని దబాయించాలని— గుర్తెట్టకపోతే నాలుగు తిట్టి బెదిరించి పచేయాలని- గవర్రాజు పెద్ద బుర్రకి తట్టిన పెద్ద ఆలోచన!

"ఎదవల్లారా, ఆ లు పల్లెటూరోళ్ళు పదూకోనాళ్ళు అని బతికిపోనారు. నేకపోతే మీ ఉద్యోగాలూడి, జైల్లో కూకునేవారు" గజేంద్రుడు ప్రార్థించగానే వెళ్ళి సహాయం చేసివచ్చిన విష్ణుమూర్తిలా బెంచిమీద తలకింద చెయ్యిపెట్టి శేషశాయి పోజులో పడుకున్న గవర్రాజు గర్వంగా అన్నాడు. నిజమే అపద్బాంధవుడివి, అనాద రక్షకుడివి— అన్నట్టు అప్పలకొండ వినయంగా ఐదు మైళ్ళు నడిచివచ్చిన గవర్రాజు కాళ్ళు పట్టాడు.

గవర్రాజు 'కంచె'ని రక్షించుకున్నాడు. రక్షించాల్సిన 'చేను'మాట మరిచిపోయి. 'చేనే' లేనపుడు 'కంచెం'దుకు— అన్నది గవర్రాజు బుర్రకి తట్టదు. ఆ బుర్ర పెద్దదయినా బుద్ధి పెద్దది గాదు మరి.

